# యూ ట్యూబ్ చూసి స్టోన్ కట్టర్‌తో శరీరాన్ని ముక్కలు చేసిన హంతకుడు

## మహిళ హత్య సంఘటనలో నిందితుడికి రిమాండ్

## మరో వివాహానికి సిద్ధపడడంతో మహిళను హత్య చేసిన నిందితుడు

మలక్‌పేట, మే 27 ప్రభాతవార్త : వివాహేతర సంబంధం, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అతికిరాతకంగా హత్యకు గురైన మాజీ నర్సు ఎర్రం అనురాధరెడ్డి కేసులో నిందితుడు బి.చంద్రమోహన్‌కు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. అత్యంత కిరాతకంగా మహిళను హత్య చేసిన ఈ సంఘటనలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**యూ ట్యూబ్ చూసి మహిళ శరీరాన్ని ముక్కలు చేసిన హంతకుడు**

చైతన్యపురిలో నివసిస్తున్న చంద్రమోహన్ తండ్రి అనారోగ్యానికి గురికావడంతో హెడ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఎర్రం అనురాధారెడ్డి (55)ని నర్సుగా చంద్రమోహన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పరిచయం కాస్తా వారి మధ్య సాన్నిహిత్యం పెరిగి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇద్దరు సహజీవనాన్ని కొనసాగిస్తున్నారు. కాగా తండ్రి మరణించడంతో చంద్రమోహన్ ఇంట్లోని ఒక పోర్షన్‌లో ఆమె అద్దెకు దిగింది. నిందితుడు ఆమె వద్దనుండి రూ. 7 లక్షల నగదును అప్పుగా తీసుకున్నాడు. అదేవిధంగా 20 తులాల బంగారు ఆభరణాలను ఆమె వద్దనుండి తీసుకోవడం జరిగింది. తన దగ్గర ఉన్న నగదు, బంగారు ఆభరణాలు తిరిగి ఇవ్వాలని అనురాధ చంద్రమోహన్‌పై వత్తిడి తీసుకువచ్చింది. దీంతో ఇద్దరి మధ్య వివాదాలు తలెత్తాయి. ఈ క్రమంలో మరో వివాహానికి సిద్ధపడిన అనురాధ తమిళ మాట్రిమోనిలో ప్రకటనలు ఇచ్చింది. తనవద్ద తీసుకున్న 7 లక్షలు, 20 తులాల బంగారు ఆభరణాలు ఇవ్వాలని తీవ్రంగా వత్తిడి చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న చంద్రమోహన్ అనురాధను అంతమొందిస్తే నగదు, నగలు ఇవ్వకుండా ఉండవచ్చని భావించి ఆమె హత్యకు పథకం రచించాడు. ఈ నెల 12వ తేదీన అనురాధతో నిందితుడు చంద్రమోహన్ వివాదానికి దిగి కత్తితో 15సార్లు ఆమెను పొడిచి అత్యంత దారుణంగా హత్య చేసాడు. ఆమెతో 15 సంవత్సరాలనుండి కొనసాగిస్తున్న వివాహేతర సంబంధానికి గుర్తుగా నిందితుడు ఆమెను 15 సార్లు కత్తితో పొడిచి హత్య చేయడం జరిగిందని తెలిసింది. హత్య చేసిన నిందితుడు చంద్రమోహన్ అనురాధ మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచాడు. పోలీసులకు దొరకకుండా ఉండడానికి మృతదేహం ఏ విధంగా మాయం చేయాలి, వాసన రాకుండా ఉండడానికి ఏమి చేయాలని యూ ట్యూబ్‌లో వెతికాడు. యూ ట్యూబ్‌లోని వీడియోల ఆధారంగా రెండు చిన్న స్టోన్ కట్టర్లు, నాలుగు పెద్ద కత్తులు, డెటాల్, ఫినాయిల్ సీసాలు, అగరబత్తులు, సెంటు సీసాలు, కర్పూరం తదితర వాటిని తీసుకువచ్చాడు. అనంతరం తల, కాళ్లు, చేతులు వేరు చేసి వాటిని ఫ్రిడ్జిలో పెట్టాడు. మొండాన్ని ఓ పెట్టెలో పెట్టాడు. అనంతరం ఈ నెల 15వ తేదీన తలను నల్లటి బ్యాగులో పెట్టి మూసారాంబాగ్ తీగలగూడ మూసీ పరివాహక ప్రాంతంలో పడేసి వెళ్లిపోయాడు. కాగా ఈ నెల 17వ తేదీ ఉదయం జిహెచ్‌ఎంసి సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో మలక్‌పేట పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని తలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటనలను సీరియస్‌గా తీసుకున్న మలక్‌పేట పోలీసులు విస్తృతంగా గాలించడంతోపాటు, సిసి ఫుటేజీల ఆధారంగా నిందితుడిని చంద్రమోహన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యూ ట్యూబ్‌లో చూసి మృతదేహాన్ని ఆరు ముక్కలుగా చేసాడని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొనడం జరిగింది. హత్యకు గురైన అనురాధ తల, మొండెం, కాళ్లు చేతులకు ఉస్మానియాలో పోస్టుమార్టం పరీక్షలు చేయించి అనంతరం ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తన కూతురితోపాటు బంధువులు ఎవరితో కూడా అనురాధ సరైన సంబంధాలు లేకపోవడంతో కూడా నిందితుడు చంద్రమోహన్‌కు కొంత కలిసి వచ్చింది. దీంతో అనురాధను చంపి శవం కనబడకుండా ఎవరూ పట్టించుకోరని అతను భావించాడు.

**అనుమానం రాకుండా సెల్‌ఫోన్‌నుండి మేసేజ్‌లు..** అనురాధ హత్య ఉదంతం బయట పడకుండా ఉండడంకోసం చంద్రమోహన్ పలు జాగ్రత్తలు తీసుకున్నాడు. ఇందులో భాగంగా అనురాధ సెల్ ఫోన్ తీసుకుని ఎవరికీ అనుమానం రాకుండా ఆమె కుమార్తెతోపాటు బంధువులకు మేసేజ్‌లు పంపించాడు. చార్‌ధామ్ యాత్రలకు వెళుతున్నట్లు కుమార్తెకు అనురాధ మాదిరిగా మెసేజ్ పెట్టాడు. అనంతరం సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేయడానికి ప్లాన్ వేసాడని తెలిసింది. కాగా నిందితుడు చంద్రమోహన్ చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండడంతో రాచకొండ కమిషనరేట్‌కు కేసును బదిలీ చేయడం జరిగింది. నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన ఈ సంఘటనలో పోలీసులు కఠోరంగా శ్రమించి నిందితుడు చంద్రమోహన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# జూబ్లీహిల్స్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

హైదరాబాద్, జూన్ 27,ప్రభాతవార్త: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ పరిధిఓలని యూసూఫ్ గూడలో గల జానకమ్మ తోటలో గుర్తితెలియని మహిళ కుళ్ళిన స్థితిలో పడిఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గుర్తించి ఉస్మానియాకు తరలించారు. మహిళలను ఎవరైనా మర్డర్ చేశారా..? లే మరేమైనా కారణమా అనేకోణంలో విశ్లేషిస్తూ దర్యాప్తు చేపట్టారు.



హైదరాబాద్ వార్త



# పడగ విప్పుతున్న క్యాన్సర్

## గుండెపోటు తర్వాత స్థానం క్యాన్సర్‌దే

## కాస్త ఆలోచించకపోతే ప్రమాదకర వ్యాధి రావొచ్చు

హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త : నగరంలో క్యాన్సర్ పడగ విప్పుతోంది. అభివృద్ధి చెందుతున్న సమాజంలో క్యాన్సర్ కల్లోలం సృష్టిస్తోంది. రోగనిరోధక శక్తి తగ్గేకొద్దీ క్యాన్సర్ విస్తరణ వేగమూ అదేస్థాయిలో పెరుగుతోంది. క్యాన్సర్ బారినపడ్డ తరువాత చికిత్స చేయడంకన్నా అది దరికిచేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమే అత్యుత్తమమైన పని. జీవన పరిస్థితులు, వ్యక్తిగత పరిశుభ్రత, జీవన శైలి వంటివి ఆరోగ్యంపై ప్రభావం కనబరుస్తాయి. క్యాన్సర్ ముందుగా గుర్తించడం సాధ్యంకాదని ఇప్పటికే చాలా మంది అపోహపడుతుంటారు. అది ఎంతమాత్రమూ నిజంకాదని వైద్యులు పేర్కొంటున్నారు. చాలా రకాల క్యాన్సర్లను తొలిదశలోన్లనే పసిగట్టవచ్చు. ప్రజల్లో అవగాహన పెరగడం నేటి తక్షణావసరం. కొన్ని రకాల క్యాన్సర్లను మాత్రం తొలిదశలోనే గుర్తించడం కుదరదు. రొమ్ము, గర్భాశయ, చర్మ, నోటి, పేగు సంబంధ క్యాన్సర్లను చాలా మందుగానే గుర్తించడం సాధ్యమవుతుంది. లక్షణాల ప్రాతిపదికన ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే చికిత్స సులభమవుతుంది. మద్యపానం, పొగాకు సేవవనం వంటి అలవాట్ల వల్ల కలిగే దుష్ఫలితాలను విరివిగా ప్రచారం చేయడంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవశ్యకత పట్ల అవగాహన పెంచితే క్యాన్సర్‌ను చాలా వరకు నిరోధించవచ్చు. ఊపరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నవారిలో 71 శాతం ధూమపానం అలవాటు ఉన్నవాళ్లే. క్యాన్సర్ మరణాల్లో 22 శాతానికి పొగాకు సేవనమే కారణమవుతోంది. గుట్కా, పాన్ మసాలాలు, తంబాకు లాంటి వాటిని విచ్చలవిడిగా నమలడం..గంటల తరబడి నోట్లో పెట్టుకోవడంతో చాలా మందికి నోట్లో తీవ్రమైన అస్సర్లు కన్పిస్తున్నాయి. వీటిని నిర్లక్ష్యం చేయడంతో 2-5 ఏళ్లలో నోటి, హెడ్ అండ్ నెక్ క్యార్సర్ల కింద రూపాంతరం చెందే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అవగాహన లేమితో పొగాకు ఉత్పత్తులను వాడుతూ వారికి తెలియకుండానే బానిసలవుతున్నారు. ముఖ్యంగా బాధితుల్లో అధిక శాతం యువత ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఎంఎన్‌జే



క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చే బాధితుల్లో 40 శాతం నోటి, హెడ్‌అండ్ నెక్‌లతో బాధపడుతున్నారని అక్కడి వైద్యులు పేర్కొంటున్నారు. యువత ఎక్కువ మంది గుట్కా, పాన్ మసాలాలు,, జర్దా లాంటి వాటిని అధికంగా తీసుకుంటున్నారు. తక్షణం ఇలాంటి వాటిని మానేయడం చాలా మంచిదని, నోట్లో దీర్ఘకాలంగా పుండ్లు, తెల్లమచ్చలు లాంటివి ఉంటే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నోరు తెరవడం, గుటక వేయడం కష్టంగా ఉండటం,ఆహారం తీసుకుంటే మింగనివ్వకపోవడం, గొంతు బొంగురు పోవడం లాంటి లక్షణాలు కన్పిస్తే తక్షణం క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలంటున్నారు. ముందే గుర్తించడంతో నోటి క్యాన్సర్లను పూర్తిగా నివారించవచ్చు. చాలా మంది 2-3 దశలు దాటిన తర్వాత చికిత్సకు వస్తున్నారని, ఇలాంటి సమయాల్లో నియంత్రణ అనేది కష్టమని చెబుతున్నారు. సుదీర్ఘంగా పిప్పి పళ్లతో నోటి గోడలకు ఇన్‌ఫెక్షన్లు లాంటివి వస్తే అశ్రద్ధ చేయకూడదని వైద్యులు పేర్కొంటున్నారు.ఏటా ఈ మహమ్మారి కేసులు, మరణాలు చాప కింద నీరులా పెరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. గాడితప్పిన జీవనశైలి కారణంగా కేసులు పెద్ద ఎత్తున నమోదవుతున్నాయని వివరిస్తున్నారు.

**30ఏళ్ళ వారిని వదలని మహమ్మారి..** ప్రపంచంలో మరణాలకు దారితీసే అతి ముఖ్య కారణాల్లో గుండెపోటు తర్వాతి స్థానం క్యాన్సర్‌దే. గతంలో 50 ఏళ్ళు పైబడిన వారిలోనే ఎక్కువగా కనిపించేది. ప్రస్తుతం 30ఏళ్ళ వారిని వెన్నాడుతోంది. 30 నుండి 40 ఏళ్ళ వయస్సులో ఏటా 10శాతం కేసులు పెరుగుతుండటం ఆందోళన చెందాల్సిన అంశమే. దీని నివారణకు చర్యలు తీసుకోకుంటే 2025 నాటికి మొదటి స్థానానికి ఎగబాకే ప్రమాదం ఉందని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. మన దేశంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కారక వైరస్ పెళ్ళీడు కొచ్చిన మహిళలందరిలోనూ ఉంటుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతుంది. ముందే కనిపెట్టగలిగితే థర్మల్ క్రయోథెరఫీ వంటి సులువైన పద్ధతుల్లో నయం చేయవచ్చు. రొమ్ములో క్యాన్సర్ కణితిగా రూపాంతరం చెందడానికి ముణ్నాలుగేళ్ళు పడుతుంది. ఈ సమయంలో కనిపెట్టగలిగితే చికిత్స సులువవుతుంది. క్యాన్సర్ లక్షణాలను ముందస్తుగా గుర్తించడం ద్వారా ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధునాతన చికిత్సలో పూర్తిగా నయం చేయడానికి అవకాశాలు మెరుగయ్యాయి.

**ఆలస్యంతోనే అధిక మరణాలు..** హెపటైటీస్ బీ, సీలు కాలేయ క్యాన్సర్‌లకు, హ్యూమన్ పాసిలోమా వైరస్(హెచ్‌పీవీ) గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రావడానికి కారణమవుతున్నాయి. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు టీకా అందుబాటులో ఉంది. 8 నుండి 18 ఏళ్ళ వయస్సు వారికి దీన్ని ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. కాలేయ క్యాన్సర్‌కు హెపటైటీస్ టీకా ఉంది. 40 ఏళ్ళు దాటిన మహిళ ఏడాదికోసారి మామోగ్రఫీ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి. అత్యధికుల్లో క్యాన్సర్‌ను గుర్తించడమే ఆలస్యమవుతోంది. దాంతో అప్పటికే ముదిరిపోయి మరణాలకు దారితీస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో విస్తృతంగా క్యాన్సర్ ముందస్తు పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్యాన్సర్‌కు ప్రధాన కారణాలలో సిగరెట్, గుట్కా, తంబాకు వంటి పొగాకు ఉత్పత్తుల వాడకంతో పాటు మితిమీరిన మద్యపానం, ఊబకాయం, వేపుళ్ళు, నిల్వ ఆహారం ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం, అధిక ఒత్తిడి, తీవ్ర నిద్రలేమిఅని వైద్యులు పేర్కొంటున్నారు.

# అత్యంత వైభవంగా టిటిడి శ్రీవారి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు



శేష వాహనంపై శ్రీవారిని పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

సైఫాబాద్, మే 27 ప్రభాతవార్త: లిబర్టి వద్దగల తిరుపతి తిరుమల దేవస్థానముల (టిటిడి) చే నిర్మించబడిన శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు తొలిరోజు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం దేవాలయంలో స్వామివారికి సుప్రభాతం, తోమాల ఆరాధన, సహస్రనామార్చన, హవనా నిర్వాహణ, పూర్ణాహుతి, బలిహరణ, ప్రభాత వాహనసేవ, సర్వదర్శనం ఘనంగా జరిగాయి. అలాగే ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ధ్వజారోహణం అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని శేష వాహనంపై పురవీధుల్లో అత్యంత వైభవంగా కన్నుల పండువగా ఊరేగించడం జరిగింది. రోడ్డుకు ఇరువైపుల భక్తులు పెద్ద ఎత్తున నిలబడి శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి 8 గంటలకు హనుమంతు వాహనంపై స్వామివారి ఊరేగింపు పురవీధుల్లో కొనసాగింది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన వితరణ జరిగింది. ఆదివారం సూర్యప్రభ వాహనంపైన శ్రీవారి ఊరేగింపు పురవీధుల్లో జరుగుతుంది. అనంతరం స్నపన తిరుమంజనం, రాత్రి 8 గంటలకు చంద్ర వాహనంపై స్వామిని పుర వీధుల్లో ఊరేగించడం జరుగుతుంది. ఈ నెల 31వ తేదీ వరకు జరిగే దేవాలయం వార్షిక బ్రహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని, అలాగే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని లోకల్ అడ్వయిజరి కమిటి అధ్యక్షుడు జి.వి.భాస్కర్‌రావు, ఉపాధ్యక్షులు వై.రవిప్రసాద్, కోమటిరెడ్డి లక్ష్మి, కొమ్ముర వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ట్రూప్‌బజార్‌లో అగ్నిప్రమాదం



గోషామహల్,మే 27ప్రభాతవార్త: ప్రమాదవశాత్తు ట్రూప్‌బజార్ లోని ఫిర్దోస్ మాల్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈసంఘటన అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిర్దోస్ మాల్‌లోని ఎల్‌ఈడి లైట్లు అమ్మకాలు చేసే షోరూమ్ రెండవ అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు వ్యాపించడంతో ప్రక్కనే ఉన్న వ్యాపారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే వారు అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా అక్కడికి చేరుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ల ద్వారా మంటలను ఆర్పివేసి అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదవశాత్తు జరిగిన మంటలతో షో రూమ్ సిబ్బంది అప్రమత్తమై బయటకు పరుగులు తీసి తమ ప్రాణాలను కాపాడుకున్నారు.పై అంతస్తులో చిక్కుకున్న ఓ మహిళాను అగ్నిమాపక దళం సిబ్బంది స్థానిక పోలీసుల సహకారంతో కాపాడారు. 3 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. ప్రమాదానికి గల కారణంపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసును అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# దళారీ దందా

## తూకాల్లో మోసం.. తొండి లెక్కలతో దోపిడీ

## మార్కెట్‌లలో రెచ్చిపోతున్న దళారులు

## మోసపోతున్న రైతులు,చిరువ్యాపారులు



హైదరాబాద్, మే 27,ప్రభాతవార్త : కమీషన్ ఏజెంట్లు తొండి లెక్కలు.. తూకాల్లో మోసాలు ఇలా ఆరుగాలం కష్టపడి పండించే రైతన్న నోట వ్యాపారులు మట్టికొడుతున్నారు. శ్రమనోర్చి చేతికొచ్చిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే వా ్యపారుల చేతుల్లో మోసాలకు బలైపోతున్నారు. ఓవైపు పంటకు కనీసమద్దతు ధర లభించకపోగా,తొండి లెక్కలతో నిలువుదోపిడీ చేస్తున్న వ్యాపారుల చర్యలను జీర్ణించుకోలేకపోతున్నారు రైతులు. ప్రజాప్రతినిధుల అండదండలతోనే వారు ఇలా రెచ్చిపోతూన్నారని వాపోతున్నారు. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించిన తమకేమీపట్టనట్లుగా ఉంటున్నారు. ఇటీవల బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌యార్డులో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న విషయాన్ని తూనికలు కొలతల అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.అయినా వారిలో మార్పు రావటం లేదు. కేవలం బోయిన్‌పల్లి మార్కెట్‌లోనే కాదు నగరంలోని కూరగాయలు, పండ్లు, పూల మార్కెట్లలో ఇదే పరిస్థితి నెలకొంది.

గ్రేటర్ పరిధిలో పెద్ద మార్కెట్లుగా పేరుగాంచిన బోయిన్ పల్లి, గుడిమల్కాపూర్, మలక్‌పేట్, కొత్తపేట్, ఎన్టీఆర్‌నగర్ మార్కెట్‌లలో కూడా దళారుల రాజ్యంగా మారింది. నగరంలో ఉన్న వాటిలో ఇవే పెద్దవి కావటంతో నగర శివారు ప్రాంతాలు, వివిధ జిల్లాల నుంచి రైతులు తరచూ ఇక్కడికి వచ్చి తాము పండించిన కూరగాయాలు, పండ్లు వ్యాపారులకు విక్రయిస్తుంటారు. తర్వాత ఈ వ్యాపారులు సిటీలో ఉన్న చిరువ్యాపారులకు హోల్‌సేల్‌గా అమ్ముతుంటారు. ఈ విక్రయాలు మొత్తం వేలం పాట ద్వారా జరుగుతుంటాయి. ఇదే క్రమంలో దళారుల చేతిలో చిరువ్యాపారులు మోస పోతున్నారు. చిరువ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులకు మాయ మాటలు చెప్పి, నాణ్యత లేని ఉత్పత్తిని వారికి అంటగడుతున్నారు. వేలం పాట సమయంలో నాణ్యతమైన ఉత్పత్తి ఉన్న డబ్బాలను పైన పెట్టి, నాణ్యతలేని ఉత్పత్తి డబ్బాలను క్రింద పెట్టి అమ్ముతున్నారు. నాణ్యతగల బాక్ ్సలోనుంచి ఉత్పత్తిని చిరువ్యాపారులకు చూపించి నెం1 మాల్, అని గోల్‌మాల్ చేసి చిరువ్యాపారుల చెవిలో పువ్వులు పెడుతున్నారు. దీనిపై మరల ఆ చిరువ్యాపారులు మార్కెట్‌కు వచ్చి, దళారులను ప్రశ్నిస్తే, మాల్ ఇక్కడున్నప్పుడే చూసుకోవాలని ఉచిత సలహాలు ఇస్తూ, వారిని కించరిచేవిధంగా మాట్లాడుతున్నారు. దళారుల అంటగట్టిన మాల్ అమ్ముడుపోకపోవడంతో ఆ చిరువ్యాపారులు నానా తంటలు పడుతున్నారు.తమ ఆవేదన చెప్పుకోవడానికి మార్కెట్ కమిటి ఆఫీసును సంప్రదించినా, మాగోడు వినే వారు లేరని రైతులు తెలుపుతున్నారు. అధికారులు,దళారులు ఒకటేనని, మార్కెట్ అధికారులకు నెలవారిగా దళారుల నుంచి కమిషన్లు వెళ్తున్నాయని నగరశివారు ప్రాంతానికి చెందిన ఓ రైతు ఆరోపించాడు.

**దళారుల్లో ప్రజాప్రతినిధుల అనుచరులే ఎక్కువ..** మార్కెట్లలో ఈదళారీ దందా నడిపేవారిలో ఎక్కువగా ప్రజాప్రతినిధుల అనుచరులే ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం మార్కెట్లలో దందాచేసుకొని ఆతర్వాత ప్రజాప్రతినిధుల వెంట అధికారపార్టీలో తిరుగుతున్నారని చాలా కాలంగా మార్కెట్‌కు వచ్చే రైతులు అంటున్నారు.ఈ కమీషన్ ఏజెంట్లు తెలివిగా ఏపార్టీ అధికారంలో ఉంటే వారి సాయంతో ముందుకు వెలుతున్నారని తెలుపుతున్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు కమీషన్లు నెలవారిగా అందుతున్నందువల్లే నిత్యం తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వాలు ఎన్ని మారినా, ఎన్ని సంస్కరణలు తీసుకొచ్చిన ఈదళారీ వ్యవస్థ మాత్రం అరికట్టలేకపోతున్నారని రైతులు వాపోతున్నారు.







యోగా మహోత్సవం

సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన యోగా మహోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు

# నక్సల్బరీ ఉద్యమమే నేటి పరిస్థితులకు ప్రత్యామ్నాయం: విప్లవ పార్టీలు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేపల్లి ప్రభాకర్

సైఫాబాద్, మే 27 ప్రభాతవార్త: గత ఐదున్నర దశాబ్దాలుగా ఎన్నో అటుపోటులను నిత్య నిర్బంధాలను తట్టుకుని సాహసోపేతంగా ముందకు సాగుతున్న విప్లవ వసంత మేఘ గర్జన నక్సల్బరి ఉద్యమమే నేటి భారత రాజకీయ పరిస్థితులకు ప్రత్యామ్నాయమని విప్లవ పార్టీల నేతలు స్పష్టం చేశారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ (ఎంఎల్) క్రాంతి జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్, సిపిఐ (ఎంఎల్) రామచంద్రన్ అధికార ప్రతినిధి బుద్దసత్యానారాయణ, సిపిఐ (ఎంఎల్) ప్రతిఘటన కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి, అఖిల భారత విప్లవ మహిళా సంఘం తెలుగు రాష్ట్రాల కన్వీనర్ సంపంగి పద్మ, ఐఎఫ్‌టియు నాయకుడు పరిగి వెంకటేష్ మాట్లాడుతూ నక్సల్బరీ ఉద్యమం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను వివరించారు. భారత విప్లవోద్యమాన్ని నిర్మించడానికి ఎందరో కామ్రేడ్స్ తమ ప్రాణాలను సైతం దారపోశారని చారుమంజుందార్, చంద్రపుల్లారెడ్డి, రాంచంద్రన్, సత్యం, కైలాసం, నిర్మల, స్నేహలత, పి.రామనర్సయ్య, నీలం రామ చంద్రయ్య, జార్జి, జంపాల, జానికరామిరెడ్డి, నారాయణ, శాంత, అరుణ, జయ, సామా అంతిరెడ్డి, మధుసూధన్ రాజ్, వినోద్, చినబాబులాంటి వందలాది మంది నాయ కులు, కార్యకర్తల త్యాగాలను నేటికి భారత విప్లవోద్యమం సజీవంగా నిలబెట్టుకుంటు వస్తున్నదని చెప్పారు. నాడు సిపిఐ, సిపిఎం చేసిన ద్రోహమే నేడు కూడా పాలకవర్గాల ప్రక్కన చేరి ప్రజల ప్రయోజనాలను, విప్లవోద్యమాలను తీవ్రంగా నష్టపరుస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నేడు అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని మోదీ కాషా యి కూటమి ప్రజల సంపదను కొల్లగొడుతూ ప్రజల ఆస్తుల ను అమ్మివేస్తున్నదని వారు ధ్వజమెత్తారు. మోదీ, కాషాయి కూటమికి వ్యతిరేకంగా అవకాశవాద, లోంగుబాటు రాజకీయ విధానాలను బలంగా తిరస్కరిస్తూ ప్రజా ఉద్యమాలు, వర్గ పోరాటాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కలిసి వచ్చే శక్తులు, సంస్థలు, వ్యక్తులతో కలిసి మనువాద ఫాసి జానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

# ప్రియుడు ఇంట్లో ప్రియురాలు ఆత్మహత్య

జవహర్‌నగర్, మే 27 ప్రభాతవార్త : ఓ యువకుడు ప్రేమించానంటూ యువతి వెంటపడ్డాడు.. పెళ్లి చేసుకుంటానంటూ నమ్మబలికాడు.. తీరా పెళ్ళికి నిరాకరించడంతో మనస్థాపం చెందిన ఆ యువతి ప్రియుడి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్‌లోని భూపేష్ నగర్‌లో నివాసముంటున్న పూజ (18) దయాకర్‌లు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల పూజ తనను పెళ్లి చేసుకోవాలని దయాకర్‌ను నిలదీయడంతో తన కుటుంబ సభ్యులను ఒప్పించాలని కోరాడు. దీంతో పూజ దయాకర్ ఉంటున్న ఇంటికి వెళ్ళింది. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత దయాకర్ అతని కుటుంబ సబ్యులు పెళ్లికి ఒప్పుకోకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన పూజ దయాకర్ ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి చున్నితో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పూజ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. పూజ మృతికి కారణమైన దయాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## చదువుతోనే సమాజంలో ప్రగతి సాధ్యం

చిక్కడపల్లి, మే 27 ప్రభాతవార్త: చదువుతోనే సమాజంలో ప్రగతి సాధ్యమవుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ బస్తీకి చెందిన ఇంటర్, ఎస్ఎస్‌సిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు అభినందన సత్కార కార్యక్రమంలో సచ్చిదానంద కళాపీఠం అధినేత రత్నాకరశర్మ అధ్యక్షతన ధనలక్ష్మి బ్రైట్‌లైట్స్ సోషల్ యాక్టివిటీస్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ అధినేత్రి ధనలక్ష్మి, మీట్ ది అబ్రాడ్ ఓవర్సీస్ ఆధ్వర్యంలో జరిగింది.

## విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలి : గవర్నర్ తమిళసై



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న గవర్నర్ తమిళసై సౌందర రాజన్



విజేతలుగా నిలిచిన వాలీబాల్ టీం సభ్యులతో కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మే 27 ప్రభాతవార్త:** చదువుతోపాటు విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని గవర్నర్ తమిళసై సౌందర రాజన్ అన్నారు. ఖేల్ భారత్..జీతో భాగ్యనగర్ ముగింపుకార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాలిబాల్‌లో విజయం సాధించిన కొత్తకాపు రవీందర్‌రెడ్డి టీం సభ్యులకు, క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన లింగాల హరిగౌడ్ యువసేన టీం సభ్యులకు గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, ఓబిసి మోర్చా మీడియా ప్రతినిధి లింగాల హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ముషీరాబాద్ గర్ల్స్, కాచిగూడ బాయ్స్ హాస్టల్ కాంప్లెక్స్‌లను పునఃనిర్మించాలి



మంత్రి ఈశ్వర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహేష్, వెంకటేష్ తదితరులు

**మలక్‌పేట, మే 27 ప్రభాతవార్త :** కాచిగూడ బాయ్స్ హాస్టల్ కాంప్లెక్స్, ముషీరాబాద్ గర్ల్స్ హాస్టల్ కాంప్లెక్స్‌లను పునఃనిర్మించడానికి బడ్జెట్ మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయంలో టిఎస్ఎస్ఎ వ్యవస్థాపక అధ్యక్షులు కూరేళ్ల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాచిగూడ బాయ్స్ హాస్టల్ కాంప్లెక్స్, ముషీరాబాద్ గర్ల్స్ హాస్టల్ కాంప్లెక్స్‌లు పురాతనమై పోయాయని వాటిని తిరిగి నిర్మించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నక్క వెంకటేష్, టిఎస్ఎస్ఎ రాష్ట్ర నాయకుు మేడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**ఎల్.బి.నగర్, మే 27 ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సరూర్‌నగర్‌కు చెందిన మచ్చేందర్ అనే వ్యక్తి పార్కు చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను దింగిలిస్తున్నాడు. సరూర్ నగర్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించగా శనివారం మచ్చేందర్ అనుమానాస్పద స్థితిలో ఉండగా అతన్ని పట్టుకొని విచారణ జరిపారు. ఈ విచారణలో వాహనాలు దింగలిస్తున్నట్లు బట్టబయలు అయింది. అతని వద్ద నుంచి సుమారు నాలుగు లక్షల 50వేల విలువైన తొమ్మిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేశారు.

## కనీస సదుపాయాలు కల్పించి సమస్యలు లేకుండా చూస్తాం : కౌన్సిలర్ విద్యావతి



కృష్ణనీటి సరఫరాను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ విద్యావతి తదితరులు

**హయత్‌నగర్, మే 27 ప్రభాతవార్త:** ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డి అన్నారు. లక్ష్మి కుటీర్ కాలనీలో కృష్ణనీటి సరఫరాను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వార్డు పరిధిలో అన్ని కాలనీలలో కనీస సదుపాయాలుకల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. ప్రజలు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని పరిసరాలలో చెత్త చెదారాలను వేయరాదని తడి, పొడిచెత్తను వేరుచేసి చెత్త ఆటోలలో తరలించేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## పటిష్టమైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు : కార్పొరేటర్

**ఎల్.బి.నగర్, మే 27 ప్రభాతవార్త :** అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ కారణంగా ప్రజల తీవ్రఇబ్బందులకు గురవుతున్నారని గడ్డి అన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. పటిష్టమైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీ వాసులకు, వాహనదారులకు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో ప్రధాన రహదారి కమలానగర్ కాలనీలో భారీ వాహనాలు మ్యాన్ హోల్ పై నుంచి వెళ్లడంతో తరచుగా డ్రైనేజీ పొంగి పోవడంతో జలమండలి అధికారులతో కలిసి డ్రైనేజి పైప్ లైన్‌ను జెట్టింగ్ మిషన్ ద్వారా శుభ్రం చేయించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో తరచూ డ్రైనేజీ నిండిపోయి కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాలనీ వాసులు కూడా పనుల విషయంలో సహకరించాలని, ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని డీజీఎం చెప్పారని వివరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు సరిత, రజిత, యాదయ్య, శ్రీనివాస్, రూప, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నీవీర్‌లుగా ఎంపికైన హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

**హయత్‌నగర్, మే 27 ప్రభాతవార్త:** హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు కంచర్ల జిగ్నేష్ జగన్‌మోహన్, గొడుగు వంశీలు భారత సైన్యంలో అగ్నివీర్‌లుగా ఎంపికయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.జోత్స్నప్రభ తెలిపారు. జగన్‌మోహన్ బీఎస్సీ డేటాసైన్స్ మూడో సంవత్సరం చదువుతుండగా... వంశీ బీఏ రెండో ఏడాది చదువుతున్నట్లు ఆమె వివరించారు. ఎన్‌సీసీవిభాగం ఆఫీసర్ సబ్‌లెఫ్టినెంట్ డా.ధన్‌రాజ్ మాట్లాడుతూ... ఎన్‌సీసీ క్యాడెట్ల అంకితభావం, కఠోర శ్రమ కారణంగానే వారు లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. వంశీ మద్రాస్ ఇంజనీరింగ్ గ్రూప్, బెంగళూర్‌లో శిక్షన పొందుతుండగా... జిగ్నేష్ ఐఎన్ఎస్ చిలుక, ఒరిస్సాలో శిక్షణ పొందుతున్నాడు. అగ్నివీర్‌లుగా ఎంపికయిన క్యాడెట్లను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఇంతియాజుద్దిన్ ఫారుఖీ, ఇతర అధ్యాపకులు అభినందించారు.

## రోడ్డు ప్యాచ్ వర్కు పనులకు శ్రీకారం



రోడ్డు పనులను ప్రారంభించిన మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, మే 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 12వవార్డు మామిడిపల్లి పాత గ్రామంలో రూ.5 లక్షల కార్పొరేషన్ సాధారణ నిధులతో చేపట్టిన రోడ్డుప్యాచ్ వర్కు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్థానిక కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్‌తో కలిసి రోడ్డు పా ్యచ్ వర్క్ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె స్థానిక అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి అక్కడి పిల్లల పౌష్టికాహారం విషయమై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానికులు గోపాల్ యాదవ్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, అంగన్‌వాడి టీచర్ రాణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: దేప

**ఎల్.బి.నగర్, మే 27 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టత పార్టీ కృషి చేయాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా బర్రె రాజుకుమార్ నియామకమైన సంధ్బంగా శనివారం ఆర్కేపురం డివిజన్ అల్కాపురిలోని దేప భాస్కర్‌రెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తున్నాను. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ జన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లేంకి ధనరాజ్‌గౌడ్, బొక్క భూపాల్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ నందిగామ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి గోపనపల్లిలో ఈ నెల 31 న విప్రహిత బ్రాహ్మణ సదనం ప్రారంభోత్సవం



శ్రీనివాసరావుకు పాసులను అందజేస్తున్న వేణుగోపాలచారి

**ఎల్.బి.నగర్, మే 27 ప్రభాతవార్త :** గచ్చిబౌలి గోపనపల్లిలో ఈ నెల 31 వ తేదీన విప్రహిత బ్రాహ్మణ సదనం ప్రారంభం అవుతుందని భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ కార్యదర్శి దుడ్డు సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వక్కలంక శ్రీనివాసరావు, యువజన సంఘం కార్యదర్శి స్వరూప్‌రాజ్ తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా సదనం ప్రారంభోత్సవం జరుగుతుందని వారు పేర్కొన్నారు. సదనం ప్రారంభోత్సవానికి సంబంధించి రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కమిటీ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి ఇన్విటేషన్ కార్డులను వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ప్రాంతాలలో ఉన్న బ్రాహ్మణ సంఘాల సభ్యులు కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రారంభోత్సవం సందర్భంగా చండీహోమాలు, లలిత విష్ణు పారాయణం, పీఠాధిపతుల ప్రవచనంలో భారత దేశంలోని ప్రధాన దేవాలయాల ప్రధాన అర్చకులు వివిధ రాష్ట్రాల బ్రాహ్మణ సంఘాల అధ్యక్షులు హాజరవుతున్నారని తెలిపారు.

## చంపాపేటలో నెహ్రూ వర్ధంతి వేడుకలు

**సైదాబాద్, మే 27 ప్రభాతవార్త:** దేశమొదటి ప్రధానమంత్రి దివంగత జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతర ం ఆయన మాట్లాడుతూ దివ ంగత జవహర్‌లాల్ నెహ్రూ పేదల సంక్షేమకోసం జీవితాంతం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాతంగి యాదగిరి, నారాయణ, కారుకొండ శివ, తోకటి కిరణ్, చింటూ, రేండ్ల శివ, రణధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బంగారు మైసమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను నిర్వహిస్తున్న రఘు దంపతులు

**మలక్‌పేట, మే 27 ప్రభాతవార్త :** మలక్‌పేట చంచల్‌గూడలోని కాలడేరా బంగారు మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఆలయ చైర్మన్ కొత్త రాఘవేంద్రగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులపాటు విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 3వ రోజు ఛండీహోమం, పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రదలతో నిర్వహించారు. అనంతరం స్థానిక మహిళలకు వడి బియ్యాన్ని అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కొత్త సత్యవతి, కొత్త నాగేష్‌గౌడ్, కొత్త శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ : ఉప్పల



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, మే 27 ప్రభాతవార్త :** తెలంగాణరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కిరీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ లోని వి స్పోర్ట్స్ అకాడమీ ఫుట్బాల్ ఇంటర్నల్ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వి స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో 9 జట్లు పాల్గొన్నాయి. మొదటి విజేతగా దానియేలు టీమ్, రన్నర్స్‌గా రిషి టీమ్, మూడవ విజేతగా వినోద్ టీమ్‌లు గెలుపొందడంతో వారికి శ్రీనివాస్‌గుప్తా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో స్పోర్ట్స్ స్టేడియంలు నిర్మించారని, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. దీంతో పలువురు క్రీడాకారులకు స్పోర్స్ కోటాలో ఉద్యోగాలు కూడా వస్తున్నాయని తెలిపారు. క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్రీడలలో రాణించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తేవాలని అన్నారు. గెలుపు ఓటములు ముఖ్యం కాదని, ప్రతి ఆటను స్పోర్టివ్‌గా తీసుకోవాలని క్రీడాకారులు స్పూర్తితో ఆడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసీబీ ఎం. శ్రీధర్‌రెడ్డి, కోచ్ సుదీర్, పి.నరేష్ కుమార్, జి.రాజు, కె.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసిసి జాతీయ అధికార ప్రతినిధి కన్హయ్య కుమార్‌కు ఘన స్వాగతం

**సరూర్‌నగర్, మే 27 ప్రభాతవార్త:** గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసిన ఏఐసిసి జాతీయ అధికార ప్రతినిధి కన్హయ్యకుమార్‌కు మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. శనివారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నియోజకవర్గానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు చిగిరింత దయాసాగర్‌రెడ్డి, సామ వరుణ్‌రెడ్డి తదితరులతో కలిసి రాఘవేందర్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛాన్నిచ్చి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శశిధర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అనుకిరణ్‌రెడ్డి, శివలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అజంపురలో అక్రమ నిర్మాణాల తొలగింపు : టౌన్ ప్లానింగ్ అధికారులు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

**మలక్‌పేట, మే 27 ప్రభాతవార్త :** చాదర్‌ఘాట్ అజంపుర పార్కు వద్ద ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను జిహెచ్ఎంసి మలక్‌పేట సర్కిల్-6 టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. టౌన్ ప్లానింగ్ ఏసిపి అర్షద్, సెక్షన్ ఆఫీసర్లు పి.వి.ప్రకాష్, సునీత, సిబ్బందితో కలిసి అజంపుర పార్కు వద్ద చుట్టూ ఉన్న పలు అక్రమ నిర్మాణాలను కూల్చివేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కు చుట్టూ అక్రమంగా ఏర్పాటు చేసిన సుమారు 40 అక్రమ నిర్మాణాలను తొలగించడం జరిగిందన్నారు. పార్కులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి స్టాళ్లు, బండ్లు ఏర్పాటు చేస్తే కూల్చి వేస్తామన్నారు. అక్రమ నిర్మాణాలు ఏర్పాటు చేయడంతో రోడ్డు ఇరుకుగా మారడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు,సిబ్బంది వాటిని కూల్చివేసారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చాదర్‌ఘాట్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు.

## బండచెరువులో గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలి : కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



బండచెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, మే 27 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు ఈస్ట్ఆనంద్‌భాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ వెంకట్ రమణ, ఏఈ శివారెడ్డి, డీఈ పవన్‌తో కలిసి బండ చెరువును పరిశీలించారు. దోమల సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గుర్రపు డెక్కను వెంటనే తొలగించి, బండ చెరువు డిసిల్టింగ్ చేసి, నాలా డైవర్షన్ పనులు, చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా బండచెరువు సుందరీకరణ పనులు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏ స్వామి, బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు, కాలని అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**గౌతమ్‌నగర్ డివిజన్‌లో..** గౌతమ్‌నగర్ డివిజన్ పరిదిలో కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్, ఏఈ దివ్యజ్యోతితో కలిసి ఐఎన్‌నగర్‌లో గుట్ట పైకి వెళ్లే మార్గం మెట్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ నరేందర్, నాయకులు మేకల రాముయాదవ్, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారంతో ప్రజలు మోసపోవద్దు : మల్కాజిగిరి తహసీల్దార్ వెంకటేశ్వర్లు

**నేరెడ్‌మెట్, మే 27 ప్రభాతవార్త :** తక్కువ ధరకే స్థలం అమ్ముతున్నట్లు సమాచారం ఇచ్చి ప్రజలను మోసం చేసే వారిని నమ్మకూడదని మల్కాజిగిరి తహశిల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని కాచవాని సింగారంలో రూ. 10వేలు కడితే 60గజాల స్థలం ఇస్తున్నట్లు ఇస్తూ మౌలాలి డివిజన్ పరిధిలోని క్రాంతి మీ సేవా సెంటర్ వద్ద కొందరు దళారులు ప్రజలను మోసం చేస్తున్నారని అట్టి సమాచారాన్ని ప్రజలు నమ్మకూడదన్నారు. గత 3రోజుల నుండి క్రాంతి మీ సేవా సెంటర్ వద్ద గుంపులుగా ఏర్పడి తక్కువ ధరకే 60 గజాల స్థలం అమ్ముతున్నట్లు తెలపడంతో కొందరు అమాయకులు రూ. 10వేలు కట్టడం జరిగిందన్నారు. రూ. 10వేలు కట్టిన మీ సెంటర్‌లో అయన తనిఖీలు చేపట్టారు. కొంతమంది దళారులు అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని ఇలాంటి వదంతులను నమ్మవద్దని అయన సూచించారు.

## పరిశుభ్రత కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలి: శ్రీవాణి



చెరువులోని చెత్తను తొలగిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

**ఎల్.బి.నగర్, మే 27 ప్రభాతవార్త :** పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ కోరారు. రిథి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సరూర్‌నగర్‌లోని చెరువును శుభ్రం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ఫౌండేషన్ సబ్యులతో కలిసి చెరువులోని చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత విషయంలో కూడా ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు కశవ్, అభిషేక్, అగస్త్య, మోహిత్‌కుమార్, నాగరాజ్, యాదవ్, వివేక్, విష్ణు ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు లేని డివిజన్‌గా చిల్కానగర్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, ఈఈ నాగేందర్

**నాచారం, మే 27 ప్రభాతవార్త:** చిల్కానగర్ డివిజన్‌లోని కుమ్మరి కుంటలో కొనసాగుతున్న వివిద అభివృద్ధి పనులను శనివారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, జీహెచ్ఎంసీ ఈఈ నాగేందర్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కుమ్మరికుంటలో సీసీరోడ్డు, పోచమ్మ ఆలయంనుంచి ఎస్సీ కమ్యూనిటీ హాల్ వరకు సీసీరోడ్డు పనులను వారు పరిశీలించారు. కల్వర్టుక్రాసింగ్ వద్ద పెద్ద పైపులను ఏర్పాటు చేయాలని భారీ వాహనాలు వచ్చినా ఎలాంటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈఈ నాగేందర్‌ను ప్రవీణ్ ముదిరాజ్ కోరారు. అదే విదంగా పనుల్లో జాప్యం జరుగకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ నిఖిల్ రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, నాయకులు ఎదుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగన్, పోచయ్య, యాదగిరి, రమేష్, బాలేందర్, ఎండీ షఫీ, ఎండీ హనీఫ్, ఎస్‌కే షఫీ, శ్యామ్, బాలుతో పాటు బస్తీవాసులు పాల్గొన్నారు.

## సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం

**మల్కాజిగిరి, మే 27 ప్రభాతవార్త :** ఆనంద్‌బాగ్‌లోని శ్రీ సాయిబాబా మందిరంలో శ్రీ సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ ఆగమ శివ ఆచార్యగారి ఆధ్వర్యంలో శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ట్రస్టు కమిటీ చైర్మన్ ఎం.వి. సుభాష్, కమిటీ సభ్యులతోపాటు పెద్ద ఎత్తున హాజరైన భక్తులు పాల్గొన్నారు.

## రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం : కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్ మే 27 ప్రభాతవార్త:** నేరెడ్‌మెట్ డివిజన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి పరుస్తానని కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని బాలాజీ కాలనీలో నూతనంగా రూ. 15 లక్షలతో సీసీరోడ్డు పనులను స్థానిక నాయకులు, కాలనీ వాసులతో కలసి ప్రారంభించారు. అనంతరం అమె మాట్లాడుతూ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే దశల వారిగా వాటిని పరిష్కరిస్తానన్నారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను సైతం పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, ఏసి సృజన, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ నాయక్, దేవేంద్ర నాయక్, నాయకులు మహత్య, గోకుల్ చిత్ర, శ్రీనివాస్, చెన్నారెడ్డి, శివ, మహేష్, రాజు, అవినాష్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలి



వికలాంగులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎన్‌పిఆర్‌డి సభ్యులు

**అబ్దుల్లాపూర్‌మెట్, మే 27 ప్రభాతవార్త :** వికలాంగుల పెన్షన్ 10 వేలకు పెంపు కోసం దశల వారీగా ఉద్యమం చేస్తామని, వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎన్‌పిఆర్‌డి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలో అంతటి మహేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాష్ట్ర జనాభాలో 12.02 శాతం అనగా 43.02 లక్షల మంది వికలాంగులు ఒక్కటి కంటే ఎక్కువ వైకల్యాలు కలిగి ఉన్నారన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా సంక్షేమ పథకాల్లో 12 శాతం వికలాంగులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవులలో వికలాంగులకు రిజర్వేషన్స్ అమలు చేయడానికి ప్రత్యేక చట్టం చేయాలనీ డిమాండ్ చేశారు. వికలాంగుల కుటుంబాలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలనీ అన్నారు. వైకల్య ధృవీకరణ పత్రం కలిగిన వికలాంగులకు బస్సులు, రైల్వేలలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు. 40 శాతం వైకల్యం కలిగిన వికలాంగులకు యుడిఐడి కార్డులు వెంటనే పంపిణీ చేయాలనీ డిమాండ్ చేశారు. ఆసరా పెన్షన్ల మంజూరుకు ఆదాయ పరిమితి నిబంధన ఎత్తి వేసి, జివో 17ను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా, జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కోని రాజు, మెట్టు మండల ఉపాధ్యక్షుడు ఇడుకుల వీరేశం పాల్గొన్నారు. అనంతరం బాటసిగారం గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గ్రామ అధ్యక్షుడుగా దర్గా నాగేశ్వర్, ఉపాధ్యక్షుడు గడ్డం దశరథ, ప్రధాన కార్యదర్శిగా కాసుల రమేష్, ప్రచార కార్యదర్శిగా తవుటి వెంకటేష్, కోశాదికారి, రామసాని సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శిగా మెడపు వెంకటేష్‌గౌడ్ తదితరులను ఎన్నుకున్నారు.